# ఘనంగా గురుపౌర్ణమి



గూడూరు: బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గురుపౌర్ణమి వేడుకలను జిల్లాలోని భక్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండల, పట్టణ కేంద్రాల్లో సాయిబాబా ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాబా ఆలయంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి నైవేద్యాలు సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని దేవుణ్ణి వేడుకున్నారు. గంగారం మండలం కోదండరామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు అర్చకుడు శివశివారి గురువును సత్కరించి పాదాభివందనం చేశారు. తొర్రూరులోని సాయి సంతోషి మందిరంలో బాబా మందిర నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మూలవిరాట్టుకు ఉదయం సుప్రభాతం, పంచామృతాల అభిషేకం, ప్రత్యేక హారతులు, సహస్ర నామార్చనలను భక్తులతో ప్రత్యేక గోత్రనామార్చనలను ఆలయ పూజారి రేణుకుంట్ల శివశర్మ చేశారు. రాత్రి భజన, బాబాకు పల్లకీ సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయి భక్త కమిటీ ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ స్ట్రీట్ సాయి ఆలయంలో మహిళలు సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలో స్వామిని ఊరేగించారు.



తొర్రూరు: భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

# మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 21: ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, శుభ కార్యాల సందర్భంగా మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వల్ల పు రాములమ్మ ఇటీవల మృతి చెందగా, ఆదివారం కర్మ కార్యక్రమాలను ఆమె కుటుంబ సభ్యులు నిర్వహించారు. రాములమ్మ జ్ఞాపకార్థం వారితో కలిసి వెంకన్న మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాములమ్మ మొక్కలు నాటి సంరక్షించేదని, కుటుంబ సభ్యులు మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. కుమార్తెలు లక్ష్మి, నీలమ్మ, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న వెంకన్న, కుటుంబ సభ్యులు

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దంతాలపల్లి, జూలై 21: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన యూసుఫ్ బైక్‌పై మద్దిరాలకు వెళ్లి వస్తుండగా సూర్యాపేట రోడ్డులో ఎస్సారెస్పీ కాల్వ వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా లక్ష్మీపురానికి చెందిన యువకులు 108కు సమాచారం అందించి తొర్రూరు దవాఖానకు తరలించారు.

## నేడు ప్రజావాణి

మహబూబాబాద్ రూరల్, జూలై 21: ప్రజావాణి కార్యక్రమం నేడు యథావిధిగా ఉంటుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ జిల్లా పర్యటనలో భాగంగా తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో పాల్గొంటారని, డివిజన్ అధికారులు తొర్రూరు రెవెన్యూ కార్యాలయంలో హాజరవుతారని, ప్రజలు తమ వినతులను అందజేయాలన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

**CHANGE OF NAME**
I, CHANDRA SEKHAR KANNA (Old name), S/o: KANNA HARINATH RAO, Resident of H.No: 16-3-766, Ekashila Nagar, Warangal, Telangana, 506002. I have changed my name as KANNA CHANDRA SHEKHAR S/o: KANNA HARINATH RAO for all purposes.

**OLD AGE HOME**
★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766

**CHANGE OF NAME**
I, N NEERAJA (Old name), W/o: KANNA CHANDRA SEKHAR, Resident of H.No: 16-3-766, Ekashila Nagar, Warangal, Telangana, 506002. I have changed my name as KANNA NEERAJA W/o: KANNA CHANDRA SHEKHAR for all purposes.

**CHANGE OF NAME**
I, VINJAMURI UMA (Old name), W/o: VAKULABHARANAM SRINIVAS, Resident of H.no: 1-7-495, APHB Colony, Subedari, Hanamkonda, Telangana, 506001. I have changed my name as VAKULABHARANAM UMA, W/o: VAKULABHARANAM SRINIVAS for all purposes.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565




డోర్నకల్: ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు వాగు



కొత్తగూడ: మొండ్రాయిగూడెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు



బయ్యారం: చింతోనిగుంపులో కనువిందు చేస్తున్న వంకమడుగు జలపాతం



బయ్యారం: గౌరారం శివారులో మత్తడి పోస్తున్న వట్టివాగు

# ఎడతెరిపి లేని వాన

- రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి నిండుకుంటున్న చెరువులు, కుంటలు
- పొంగుతున్న వాగులు, ప్రాజెక్టుల్లోకి చేరుతున్న నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు

మహబూబాబాద్ రూరల్, జూలై 21: జిల్లాలోని మండలాల్లో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. ప్రధానంగా కొన్ని మండలాల్లో భారీ వర్షం పడడంతో కుంటలు నిండాయి. మరి కొన్నిచోట్ల చెరువులు అలుగు దశలో ఉన్నాయి. పలు కాలనీలు, ప్రధాన కూడళ్లలో నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో నీరు నిల్వకుండా మున్సిపల్, పంచాయతీ సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలను అధికారులు సెంటీమీటర్లలో వెల్లడించారు. కొత్తగూడ మండలంలో 4.2 సెంటీ మీటర్లు, గంగారంలో 2.7, బయ్యారంలో 2.1, గార్లలో 1.5, డోర్నకల్ 1.5, కురవి1.6, మానుకోటలో 2.5, గూడూరు 2.8, కేసముద్రంలో 1.7, నెల్లికుదురులో 2.7, నర్సింహులపేటలో 1.5, చిన్నగూడూరులో 1.5, మరిపెడలో 2.4, దంతాలపల్లి 1.7, తొర్రూరులో 2.2, పెద్దవంగరలో 1.2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందన్నారు.

**డోర్నకల్‌లో**

డోర్నకల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు జలకళ సంతరించుకున్నాయి. మున్నేరు వాగు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద ఉధృతికి నూతనంగా నిర్మించిన చెక్‌డ్యామ్ మత్తడి పోస్తున్నది. చెరువులు, కుంటలు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లకు సన్నద్ధం అవుతున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు: వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజు, ఎంపీడీవో బాలరాజు అన్నారు. మండలంలోని తొర్రూరు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రావిరాల, ఆలేరు, వావిలాల గ్రామాల వద్ద కల్వెను తహసీల్దార్, మేచరాజుపల్లి- ఎర్రబెల్లిగూడెం మధ్య ఉన్న కాజ్‌వే, నెల్లికుదురు-ఆకేరువాగు బ్రిడ్జిల మధ్య కాజ్‌వేను ఎంపీడీవోలు వేర్వేరుగా ఆదివారం పరిశీలించి మాట్లాడారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని, ప్రమాద అవకాశాలుంటే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నెల్లికుదురు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లిగూడెం కార్యదర్శి గణేశ్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రబెల్లిగూడెం-మేచరాజుపల్లి గ్రామాల మధ్య కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలరాజు

## చుక్క నీరు జారలేదు..

నర్సింహులపేట: రెండ్రోజులుగా వర్షం కురుస్తున్నా చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు చేరలేదు. మండల పరిధి 22 గ్రామాల్లోని 8 చెరువులు 38 కుంటల్లో వర్షపు నీరు చేరని పరిస్థితి. జూన్, జూలైలో అనుకున్నస్థాయిలో కంటే తక్కువ వర్షపాతం నమోదైనా ప్రస్తుతం కురుస్తున్న వర్షం వల్ల రోడ్లు బురదమయం అవడం తప్పు చెరువుల్లోకి నీరు చేరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిసి చెరువులు, కుంటలు నిండాలని వేడుకుంటున్నారు.



నర్సింహులపేట: పెద్దనాగారం బతుకమ్మ చెరువులోకి చేరని వర్షపు నీరు



భీమునిపాదం జలపాతం వద్ద సందడి చేస్తున్న యువకులు

## కనువిందు చేస్తున్న భీమునిపాద జలపాతం

గూడూరు: ప్రకృతి రమణీయతను చాటుతూ జాలువారుతున్న భీమునిపాద జలపాతానికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన యువత సందడి చేసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలధార ఎక్కువ అవుతుండడంతో ఎస్సై నగేశ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిని నియమించి, నీటిలోకి పర్యాటకులను వెళ్లకుండా పర్యవేక్షించారు. జలపాతం వద్ద రక్షణ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## పొంగిపొర్లుతున్న వాగులు

కొత్తగూడ: కొత్తగూడ ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నర్సంపేట - కొత్తగూడ మధ్యలో బూర్కపల్లి వాగు, గాదె వాగు, వేలుబెల్లిలోని కత్తెర్లవాగు, మొండ్రాయిగూడెంలోని పెద్దవాగు మత్తడి పోస్తున్నాయి. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు.

## తొర్రూరులో కూలిన ఇండ్లు

తొర్రూరు: వర్షాల వల్ల మండలంలో రెండు ఇండ్లు పాక్షికంగా కూలినట్లు ఎంపీడీవో సిలార్ సాహెబ్ తెలిపారు. హరిపిరాల ముదిరాజ్ కాలనీలో సిరిబోయిన రాములు ఇల్లు పూర్తిగా కూలిపోయిందని, సోమ్లాతండాలో జాటోత్ పాండు ఇంటి గోడ పాక్షికంగా కూలి ధ్వంసమయ్యాయని తెలిపారు. వాటిని పరిశీలించామని, ప్రభుత్వం ద్వారా తక్షణ ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అదేవిధంగా హరిపిరాల చెరువు, చెక్‌డ్యాం వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మండలంలో ఆదివారం ఉదయం 8 గంటల వరకు 2.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

తొర్రూరు: హరిపిరాలలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సిలార్ సాహెబ్



## ఏజెన్సీ అతలాకుతలం

బయ్యారం: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ గ్రామాలు అతలాకుతలం అవుతున్నాయి. జనం బయటికి రావాలంటేనే జంకుతున్నారు. వరద నీరు చేరడంతో పెద్దచెరువు ఉధృతంగా అలుగు పోస్తున్నది. తులారం ప్రాజెక్ట్, గౌరారం వట్టివాగు కట్టు, పెద్దగుట్టపై పాండవుల జలపాతం, చింతోనిగుంపులోని వంకమడుగు జలపాతం కనువిందు చేస్తున్నాయి. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. అదే విధంగా మసివాగు, అలిగేరు, పాకాల ఏరు, పంది పంపుల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మొట్లతిమ్మాపురం రహదారిలోని వట్టివాగు నీరు పైకి చేరడంతో రాకపోకలు స్తంభించాయి. పెద్దగుట్ట పాండవుల జలపాతాన్ని సీఐ రవికుమార్, ఎస్సై ఉపేందర్ పరిశీలించి, సందర్శకులు రావద్దని సూచించారు.

బయ్యారం: శివారులో ప్రవహిస్తున్న అలిగేరు వాగు



## దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

చిన్నగూడూరు(మరిపెడ), జూలై 21: డోర్నకల్ ఎమ్మెల్యే, విప్ డాక్టర్ రాంచంద్రూనాయక్ ఆదివారం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దుర్గామాతను వేడుకున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సతీమణి ప్రమీల, కుటుంబ సభ్యులు ఉన్నారు.



కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ దంపతులు

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహబూబాబాద్ రూరల్, జూలై 21: జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో 1976-77 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణ శివారులోని ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారుగా 60 మంది విద్యార్థులు చదువుకోగా తమ గురువులను గౌరవించాలని, స్నేహితులను మళ్లీ కలుసుకోవాలని ప్రధాన లక్ష్యంతో వేడుక ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించి, స్నేహితులతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కుటుంబ సభ్యులతో ఆనందంగా సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీవితంలో స్నేహబంధం చాలా గొప్పదని, 47 ఏండ్ల క్రితం చదువుకున్న వారందరూ కుటుంబ సభ్యులతో ఒకే వేదికపై కలుసుకోవడం శుభపరిణామం అన్నారు. అనంతరం గురువులు డీ సత్యనారాయణ, ఎం రమేశ్‌రెడ్డి, జీ సత్యం, ఏ దుర్గయ్యను ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థులు సన్మానించి, మెమెంటోలు అందజేశారు. పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ నాయిని వెంకటరెడ్డి, మిత్రులు, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వవిద్యార్థులు

# ఎస్సైల బాధ్యతల స్వీకరణ

కేసముద్రం, జూలై 21: బదిలీపై వచ్చిన ఎస్సైలు జిల్లాలోని వివిధ మండలాల్లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కేసముద్రం ఎస్సైగా మురళీధర్ రాజ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పని చేసిన ఎస్సై వంశీధర్ బదిలీపై వెళ్లగా, మహబూబాబాద్ డీసీఆర్‌బీలో విధులు నిర్వర్తించిన ఎస్సై మురళీధర్‌రాజ్ కేసముద్రానికి బదిలీ అయ్యారు.



ఎస్సై మురళీధర్‌రాజ్

**బయ్యారం ఎస్సైగా తిరుపతి**

బయ్యారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్సైగా కే తిరుపతి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఉపేందర్ పెద్దవంగరకు బదిలీ కావడంతో డోర్నకల్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి బయ్యారం వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.



ఎస్సై తిరుపతి

**నెల్లికుదురు ఎస్సైగా రమేశ్‌బాబు**

నెల్లికుదురు: నెల్లికుదురు ఎస్సైగా సీహెచ్ రమేశ్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కే క్రాంతికిరణ్ మహబూబాబాద్‌కు రిజర్వ్‌డ్‌గా వెళ్లగా, రమేశ్‌బాబు బదిలీపై నెల్లికుదురు ఎస్సైగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని, అందు కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్‌బాబుకు పోలీసు సిబ్బంది, నాయకులు, కులసంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు.



ఎస్సై రమేశ్‌బాబు

## బైక్ సీటులో దూరిన పాము

**షాక్‌కు గురైన యువకుడు**

తొర్రూరు, జూలై 21: పట్టణంలోని అరుణోదయ కాలనీకి చెందిన దొమ్మాటి అశోక్ పల్సర్ బైక్ సీటు కింద పాము దూరింది. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల అశోక్ బైక్‌ను ఇంట్లోనే పార్కు చేశాడు. ఓ పాము బైక్ సీట్ కింద నుంచి బయటకు వస్తున్న క్రమంలో చూసి భయాందోళనలకు గురయ్యాడు. స్థానికుల సహాయంతో పామును బయటకు లాగి చంపినట్లు తెలిపారు.



బైక్ సీటులో దాగి ఉన్న పాము

## స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, జూలై 21: పట్టణంలో ఆదివారం స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి రాజేశ్ హాజరయ్యారు. రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి కనీస వేతనం రూ.20 వేలు అందించాలన్నారు. అనంతరం జిల్లా స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన అడ్‌హక్ కమిటీ ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రమేశ్, కన్వీనర్‌గా వినోద్, కోకన్వీనర్‌గా మురళి, సభ్యులుగా శరత్, రాంబాబు, రఘు, యాకయ్యను ఎన్నుకున్నారు.

## ఏరియా దవాఖానలో ఎమ్మెల్యే తనిఖీ

మహబూబాబాద్ రూరల్, జూలై 21: జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుతో కలిసి వార్డుల్లో తిరిగి వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుకున్నారు. దవాఖానకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం మండలంలోని జమాండ్లపల్లి శివారు చంద్రుతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుడు బాలాజీనాయక్ తల్లిదండ్రులు దవాఖానలో చికిత్స పొందుతుండగా, యోగక్షేమాలను అడిగి తెలుకున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

దంతాలపల్లి, జూలై 21: మండలంలోని బీరిశెట్టిగూడేనికి చెందిన మిడతపల్లి భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అమె కుటుంబానికి గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన సూరబోయిన లింగన్న బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ వ్యవస్థాపకుడు ఆజాద్ చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కేసముద్రం, జూలై 21: మండలంలోని కేసముద్రం విలేజికి చెందిన దేశబోయిన కుమార్ తండ్రి నర్సయ్య ఇటీవల మృతి చెందగా ఆదివారం కుమార్ చిన్ననాటి స్నేహితులు నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.17 వేల ఆర్థిక సాయం అందించారు. సట్ల శ్రీనివాస్, ఎస్‌కే అఫ్జల్, చిలంచర్ల సతీశ్, నీలం దుర్గేశ్, శ్రీనివాస్, శ్రీధర్, పెద్దస్వామి, నారాయణ, వేణు, కీర్తి, సురేందర్ ఉన్నారు.

**కల్వలలో మృతుడి కుటుంబానికి..**

కల్వలకు చెందిన చెక్కల పుల్లమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబానికి భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూ.8వేల ఆర్థిక సాయం ఆదివారం అందించారు. మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు కట్టయ్య, ఐలయ్యను ఓదార్చారు. శ్రీశైలం, శ్రీనివాస్, కూన మల్లేశం, పాషా ఉన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

నెల్లికుదురు, జూలై 21: పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎస్సై సీహెచ్ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. మండలంలోని కాచికల్ శివారు ముత్యాలు ఇటుక బట్టీ వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో దాడి చేశారు. చల్ల ముత్యాలు, చల్ల వెంకన్న, చల్ల సురేశ్, బత్తుల కృష్ణ, గుంజే శ్రీను, తుర్క శ్రీను, బుజ్జిబాబును అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.17,700 నగదు, 51 పేకలు స్వాధీనం చేసుకున్నారు. 2 బైక్‌లు, ఒక కారును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## వరద ప్రమాద ప్రాంతాల పరిశీలన

పెద్దవంగర: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని వరద ప్రమాద ప్రాంతాలను ఎంపీడీవో బీ వేణుమాధవ్ ఆదివారం పరిశీలించారు. గంట్లకుంట, పోచంపల్లి, రాజమాన్‌సింగ్ తండా, అవుతాపురంలో ప్రమాద ప్రాంతాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు అశోక్, మురళి ఉన్నారు.

## అక్రమ డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూలై 21: జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గిరిజన శాఖలో పని చేసి బదిలీ అయిన అనంతరం కూడా మళ్లీ డిప్యూటేషన్ పేరిట విధుల్లో చేరుతున్నారని తెలిపారు. విద్యార్థుల కడుపుకొట్టి డైట్ బిల్లులు కాజేస్తున్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హథీరామ్, రవినాయక్, కిరణ్, రాజేందర్ పాల్గొన్నారు.

## 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్ ఆవిష్కరణ

కురవి, జూలై 21: హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంట యాదగిరి, ఆమెడ రమేశ్, నాగరాజు, కృష్ణారావు, సైదులు, మహిపాల్‌రెడ్డి, శంకర్, శరత్, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా అశోక్

కేసముద్రం, జూలై 21: లయన్స్‌క్లబ్ కేసముద్రం మండల అధ్యక్షుడిగా మామిడి అశోక్ ఎన్నికయ్యారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రావుల నవీన్‌రెడ్డి, కోశాధికారిగా లక్కాకుల సత్యనారాయణను ఎన్నుకోగా వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేసముద్రం లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆర్ వెంకట్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, చిర్ర యాకాంతంగౌడ్, చంద గోపి, డాక్టర్ చంద్రశేఖర్, ఊకంటి యాకూబ్‌రెడ్డి, యర్నం శ్రీరాములు, బెజ్జం ప్రేమ్‌కుమార్, పరాంకుశం శ్రీహరి, మారం సమ్మిరెడ్డి, ఇమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డి ఉన్నారు.




లయన్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు